RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్
సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :56 ఆదివారం 24 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## తెలంగాణలో వడదెబ్బతో ఒక్కరోజులో 34 మంది మృతి



**హైదరాబాద్:** తెలంగాణలోని 16 జిల్లాల్లో 46 డిగ్రీలు ఉష్ణోగ్రత దాటింది. రాష్ట్రంలో ఒక్క రోజులో 34 మంది వడదెబ్బతో మృతి చెందారు. మరో నాలుగు రోజులు ఎండ తీవ్రత ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసారు.

రిపోర్టర్లు కావలెను
ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను
సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యులేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.
ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

# కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ



- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ
- పదవీ కాలం పూర్తయిన పీఏసీఎస్‌లను నామినేట్ పద్ధతిన నియమించాలని నిర్ణయం
- గచ్చిబౌలి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధికి క్యాబినెట్ ఆమోద ముద్ర
- చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయం
- హాజీపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం
- ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 85.10 ఎకరాలను మత్స్య శాఖకు కేటాయిస్తూ నిర్ణయం
- ఆర్టీసీ సమ్మెపై స్పందించిన రేవంత్ రెడ్డి
- రేపు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కార్మిక సంఘాలతో చర్చలు
- జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకంకు కేబినెట్ ఆమోదం

**హైద్రాబాద్ మే 23:** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. కేబినెట్ భేటీ అనంతరం నిర్ణయాలను మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడించారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె, కాళేశ్వరం ప్రాజెక్టు, పీఏసీఎస్లు తదితర అంశాలపై చర్చించినట్లు మంత్రులు వెల్లడించారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం – రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్నట్లు టిలిపారు. కాళేశ్వరం అంశానికి సంబంధించి ఏవిధంగా ముందుకు వెళ్లాలనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. మంత్రుల సబ్‌కమిటీ వేసుకుని చర్చించుకుని ఎలా ముందుకెళ్లాలనేది నిర్ణయిస్తామని అన్నారు. కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ(కేంద్ర దర్యాప్తు సంస్థ) లేఖ రాసి 9 నెలలు గడిచినప్పటికీ ఎందుకు ముందుకెళ్లట్లేదో మీరే అర్థం చేసుకోవచ్చన్నారు. తాను, సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే సీబీఐ డైరెక్టర్‌ను కలవబోతున్నట్లు వివరించారు.

**వారిద్దరూ నిర్దోశులని ఎక్కడా చెప్పలేదు**

కాళేశ్వరం అవకతవకలపై వేసిన కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని కేసీఆర్, హరీశ్‌రావులు పిటిషన్ వేశారని, అయితే, కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కేసీఆర్, హరీశ్‌రావుల ప్రధాన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చిందని వివరించారు. కమిషన్‌ను చట్టవిరుద్ధం కాదని నివేదిక కొనసాగుతుందని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంగా చెప్పిందన్నారు. సాంకేతిక అంశాల కారణంగానే కేసీఆర్, హరీశ్‌రావులపై చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించిందన్నారు. వారిద్దరూ నిర్దోషులని, కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులు కారని హైకోర్టు ఎక్కడా చెప్పలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. అభిషేక్ సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

"గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలు రూ.వేల కోట్లు పెండింగ్లో పెట్టింది. ఇంకా రూ.6 వేల కోట్ల మొత్తం ప్రయోజనాలు వారికి ఇవ్వాల్సి ఉంది. ఈ బెనిఫిట్స్ ఇచ్చేందుకు మంత్రుల వేతనాల్లో సగం కేటాయిస్తున్నాం. బెనిఫిట్స్ పూర్తిగా ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియంను అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది. ఈ స్టేడియంలోని 76 ఎకరాలను రూ.700 కోట్లతో అభివృద్ధి చేయనుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలిపారు.

# తెలంగాణ వ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్..

## మంత్రి పొంగులేటి కీలక సూచనలు.....




**హైదరాబాద్, మే 23 :** రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో ఈరోజు (శనివారం) అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజల ప్రాణ రక్షణే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు.

**గంట గంటకు హెచ్చరికలు జారీ..**

ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది..

**: మల్లికార్జున్ ఖర్గే..**



**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎనిమిది రోజుల వ్యవధిలోనే మూడు సార్లు ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలతో దేశ ప్రజలను బీజేపీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై రోజువారీగా రూ.1,000 కోట్ల పన్నులను కేంద్రం విధిస్తోందని.. అయినా మోదీ ప్రభుత్వానికి అత్యాశ తీరలేదని ఖర్గే విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ.. ఆ ప్రయోజనాలను దేశ ప్రజలకు అందించలేదని ఖర్గే నిప్పులు చెరిగారు. ఇది ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడమేనని మండిపడ్డారు. సంక్షోభం వచ్చినప్పుడు ఎన్నికల ప్రచారంలో బీజేపీ మునిగిపోయిందని, ఆ తర్వాత ఇప్పుడు త్యాగం గొప్పతనం గురించి చెబుతోందని ఆయన విమర్శించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఇంధన ధరలు అత్యంత తక్కువగా ఉన్నాయని కమలం పార్టీ నేతలు చెబుతున్నారని ఖర్గే ఆగ్రహించారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతా బాగానే ఉందని భారతీయులకు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని అన్నారు. కానీ అదే సమయంలో ఇతర దేశాలు తమ పౌరులకు చురుకుగా సహాయాన్ని అందించాయని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఇంధనంపై ఇటలీ ఎక్సైజ్ సుంకాలను తగ్గించి పౌరులకు ఉపశమనం కలిగించిందని చెప్పారు. ఆస్ట్రేలియాలో ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో పెట్రోల్ ధరలు లీటరుకు - మిగతా5లో

# ప్రధాని మోదీతో మార్కో రుబియో భేటీ..

## భారత్-అమెరికా సంబంధాలపై కీలక చర్చలు..



అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, వాణిజ్యం, ఇండో-పసిఫిక్ భద్రత అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం రుబియో ముందుగా కోల్‌కతాకు చేరుకుని మథర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఢిల్లీకి చేరుకుని ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. రుబియో భారత పర్యటనలో ముఖ్యంగా క్వాడ్ భాగస్వామ్యం, చైనా ప్రభావం, సరఫరా గొలుసులు, రక్షణ సహకారం, ఇంధన భద్రత వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి. భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన లక్ష్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు

# యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా..

## బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్...



**హైదరాబాద్, మే 23:** బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలా? వద్దా? హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

# సంపాదకీయం

## ఒకప్పుడు అప్రతిహతం..

# నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్-అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది. కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టీ ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్‌ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటీష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి. కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది. ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది. చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది. "దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం. సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది. బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది. నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి.

## వికసిత భారత్ లక్ష్యంలో

# యువతదే కీలక పాత్ర

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మే 23:** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల



సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు.

**స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు శిక్షణ..**

స్టార్టప్స్, యూనికార్న్స్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ -

మిగతా5లో

# ఎండల మంట అంతా యూపీలోనే

**లక్నో, మే 22:**సరిగ్గా మూడు రోజులక్రితం ఉత్తర ప్రదేశ్ లో 46కు మించిన డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుత సీజన్ లో ఇదే హైయెస్ట్ రికార్డు అనుకుంటే.. ఇప్పుడు అంతకుమించిన స్థాయిలో టెంపరేచర్ రికార్డు అవుతోంది. భయటికి వెళ్లాలంటేనే భయం కలుగుతోంది. ఒకవేళ బయటికి వెళ్తే క్షేమంగా ఇంటికి వస్తామా అనే ఆందోళన కలుగుతోంది. ఎందుకంటే ఎండలు ఆ స్థాయిలో ఉన్నాయి మరి. ఎండలు ఇలా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు నరకం చూస్తున్నారు. డీ హైడ్రేషన్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొన్ని సందర్భాలలో తీవ్రమైన అనారోగ్యానికి కూడా గురవుతున్నారు. దేశవ్యాప్తంగా సగటున 40 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అంతేకాదు వడగాలులు కూడా తీవ్రంగా వీచాయి. వడదెబ్బ మరణాలు కూడా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా టాప్ హీట్ నగరాలు కూడా మనదగ్గర నమోదయ్యాయంటే ఎండ తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వడగాలుల వల్ల శుక్రవారం మధ్యాహ్నం వరకే 40 డిగ్రీలకు మించి టెంపరేచర్ రికార్డయింది. ఒడిశాలోని బాలన్ గిర్ ప్రాంతంలో ఏకంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఈ విషయాన్ని బయట పెట్టింది. చంద్రాపూర్(మహారాష్ట్ర), ప్రయాగ్ రాజ్(ఉత్తరప్రదేశ్), ఛత్తీస్ గఢ్, బిహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పలు ప్రాంతాలలో రికార్డు స్థాయిలో టెంపరేచర్ నమోదయింది. టాప్ 50 నగరాలలో సగం ఉత్తర ప్రదేశ్ లోనే ఉన్నాయి. ఇప్పటికే వాయవ్య, మధ్యభారత్ ప్రాంతంలో వడగాలులు చుక్కలు చూపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్ లను వాతావరణ శాఖ జారీ చేసింది. మధ్యాహ్నంవరకు వాతావరణ శాఖ విడుదల చేసిన వరల్డ్ హాట్50 నగరాలలో అన్ని కూడా మనదేశంలోనే ఉన్నాయి. వేడి మాత్రమే కాదు, వడగాలుల తీవ్రత మనదగ్గర అధికంగా ఉంది. వాతావరణంలో మార్పులు, కాలుష్యం,



పారిశ్రామీకకరణ, చెట్లను నరకడం వంటి పరిణామాలు ఎండ వేడిమి పెరగడానికి దోహదం చేస్తున్నాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు

## మోదీ ప్రభుత్వం రూ.1,047 లక్షల కోట్ల

# అప్పులు చేసింది: జగ్గారెడ్డి..

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం



మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడుతున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచకుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. రాహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

# తమిళనాడు, కేరళలో ఏఐ మంత్రులు..

**అప్ డేట్ కేబినెట్స్**

**బెంగళూరు, మే 22:**కేరళ , తమిళనాడు ప్రభుత్వాలు సాంకేతిక రంగంలో మరో విప్లవాత్మక అడుగు వేశాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేసి మంత్రులను నియమించారుకేరళ, తమిళనాడుల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. కేరళ సీఎం సతీశన్, తమిళనాడు సీఎం విజయ్ సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో, కేవలం ఐటీ శాఖకు పరిమితం కాకుండా ఏఐ కోసం ప్రత్యేక పోర్ట్‌ఫోలియోను కేటాయించడం ద్వారా తమ దూరదృష్టిని చాటుకున్నారు. తమిళనాడు మంత్రివర్గ విస్తరమలో వేళచ్చేరి నియోజకవర్గ ప్రతినిధి కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా యువతకు ,టెక్నాలజీకి పెద్దపీట వేసినట్లయింది. భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టి, డేటా సెంటర్లు , స్మార్ట్ గవర్నెన్స్‌లో ఈ శాఖ కీలక పాత్ర పోషించనుంది. కొత్తగా నియమితులైన ఏఐ మంత్రుల ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. తమిళనాడు ఏఐ మంత్రి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా చేరవేయడానికి ఏఐ టూల్స్‌ను ఉపయోగించడం, భాషా అడ్డంకులను తొలగించడానికి తమిళ భాషా ఏఐ మోడల్స్ ను అభివృద్ధి చేయడం ఈ శాఖ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వినూత్న మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది కేవలం సాంకేతిక శాఖ మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే ఇంజిన్‌గా మారబోతోంది. ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలు ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. తమిళనాడును ఏఐ హబ్‌గా మార్చడం ద్వారా అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించడం మంత్రి కుమార్ ప్రాథమిక బాధ్యత. ఇప్పటికే చెన్నై ఐటీ రంగానికి నిలయంగా ఉంది, ఇప్పుడు ప్రత్యేక ఏఐ శాఖ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఏఐ



ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం ద్వారా లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కొత్త అవకాశాలు దక్కే అవకాశం ఉంది. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతారనే ఆందోళనల మధ్య, ఈ మంత్రిత్వ శాఖ మానవ వనరులను రీ-స్కిల్లింగ్ చేయడంపై దృష్టి సారించనుంది. కాలేజీ స్థాయి నుంచే విద్యార్థులకు ఏఐ లో శిక్షణ ఇవ్వడం, నిరుద్యోగులను ఏఐ నిపుణులుగా మార్చడం వంటి కీలక నిర్ణయాలు ఈ శాఖ పరిధిలోకి వస్తాయి. మంత్రి కుమార్ తన బాధ్యతలను ఎలా నిర్వహిస్తారు? ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను తమిళనాడుకు ఎలా అన్వయిస్తారు? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. కేరళ ఇప్పటికే ఏఐ కాన్క్లేవ్‌లు నిర్వహిస్తూ ఈ రంగంలో ముందుండాలని చూస్తోంది. ఇప్పుడు తమిళనాడు కూడా పోటీలోకి రావడంతో దక్షిణాది రాష్ట్రాలు టెక్నాలజీ పరంగా దేశానికే దిక్సూచిగా మారుతున్నాయి. ఏఐ శాఖ ద్వారా పారదర్శకమైన పాలనను అందిస్తూనే, ప్రైవేట్ భాగస్వామ్యంతో సరికొత్త ప్రాజెక్టులకు కుమార్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే మరిన్ని రాష్ట్రాలు ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది.

# గొర్రెకుంటలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం....

## చెస్ట్ ఎక్స్‌రేలు, బీపీ-షుగర్ పరీక్షలతో గ్రామస్తులకు ఆరోగ్య భరోసా

**గ్రేటర్ వరంగల్, మే 23 అక్షర సవాల్:** గీసుకొండ మండల పరిధిలోని గొర్రెకుంట గ్రామపంచాయతీ గ్రామీణ ఆరోగ్య సబ్ సెంటర్‌లో ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రజల ఆదరణతో విజయవంతమైంది. వరంగల్ జిల్లా డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు మార్గదర్శకత్వంలో, మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శౌర్య శరణ్య పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉచిత చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో శిబిరం సందడిగా సాగింది. ఈ సందర్భంగా కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎలగొండ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే



గుర్తించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్



నేహా, మార సాగర్, ఇంద మనోజ్, ఏఎన్ఎంలు శకుంతల, భవాని, మాధవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సూపర్వైజర్ కిరణ్ కుమార్, ఎక్స్‌రే ఆపరేటర్ రంజిత్, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, ఆశా వర్కర్లు ఈసంపెల్లి వజ్ర, ల్యాదల్ల నిర్మల, కొట్టే అపరంజి, బందెల రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పశు మార్కెట్‌పై డీసీపీ నిఘా

### వ్యాపార లావాదేవీల పరిశీలన.. గీసుకొండ పోలీస్ స్టేషన్ పనితీరుపై సమీక్ష





**గీసుగొండ, మే 23 అక్షర సవాల్:** గీసుకొండ మండలంలోని కొమ్మాల పశు మార్కెట్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మామునూర్ ఏసీపీ వెంకటేష్ తో కలిసి మార్కెట్‌లో జరుగుతున్న పశువుల కొనుగోలు, విక్రయాల వ్యవహారాలను పరిశీలించి వ్యాపారులు, సిబ్బందికి భద్రతా పరమైన సూచనలు చేశారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం అధికారులు గీసుకొండ పోలీస్ స్టేషన్ ను సందర్శించి స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదులు, కేసుల దర్యాప్తు పురోగతి, అరెస్టుల వివరాలను సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ సీఐ విశ్వేశ్వర్, ఎస్సై అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# "మండుటెండల్లో మజ్జిగ మానవత్వం"

## కొమ్మాల అంగడిలో 4 వేల మందికి చల్లని ఉపశమనం...

## అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ సేవలకు ప్రశంసలు

**గీసుకొండ, మే 23 అక్షర సవాల్:** రాష్ట్రంలో రోజురోజుకూ మండిపోతున్న ఎండల మధ్య రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులకు చల్లని ఊరటనిచ్చేలా అల్లం బాల కిషోర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత "శీతల మజ్జిగ పంపిణీ -- దాహ నివారణ సేవ" కార్యక్రమం కొమ్మాల అంగడి ప్రాంగణంలో ఘనంగా జరిగింది. అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆలోచనతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ప్రజల నుంచి విశేష స్పందన పొందింది. దాదాపు 4 వేల మందికి పైగా రైతులు, పశువుల వ్యాపారులు, ప్రయాణికులకు ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ చేసి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించారు. జిల్లా నాయకులు, గీసుకొండ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్, జిల్లా నాయకులు అల్లం మర్రెడ్డి స్వయంగా మజ్జిగ పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో మమేకమై సేవ చేయాలనే తపన ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, దస్రుతండ సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి, మాజీ సర్పంచ్ కేలోత్ స్వామి, నాయకులు మదాసి రాంబాబు, పొగాకు బిక్షపతి, ఓదెల సురేష్, పాకనాటి మధు, బోయ అశోక్, సాయిలీ మధు, పసుల యుగేందర్, దౌడు రాజేష్, వాంకుడోత్ తిరుపతి, గూగులోతు రాజు, గద్దల రమేష్, భూక్యా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. ప్రతి శనివారం ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు



తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఆదర్శంగా నిలిచిందని స్థానికులు ప్రశంసించారు.

# వరి కొయ్యలు కాల్చొద్దు మొక్కజొన్న సొప్పకు మంట పెట్టొద్దు

: ఎస్సై.మహేందర్ హెచ్చరిక



**నెక్కొండ,మే 23 అక్షర సవాల్ :** పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల సార శక్తి దెబ్బతినడంతో పాటు గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని నెక్కొండ ఎస్సై ఎం.మహేందర్ హెచ్చరించారు. వరి కొయ్యలు,మొక్కజొన్న సొప్ప వంటి వ్యవసాయ అవశేషాలకు మంట పెట్టవద్దని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించి,భూమి ఉరుకుతనం తగ్గిపోతుందని,గాలి కాలుష్యం పెరిగి జీవరాశుల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ఈ చర్యలు చట్టవిరుద్ధమని,కాల్చినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు పంట అవశేషాలను యంత్రాల సహాయంతో దమ్ము చేసి ఎరువుగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే కంపోస్ట్ తయారీ,బయోగ్యాస్ ఉత్పత్తి,మల్చింగ్ విధానాలు,పుట్టగొడుగుల సాగులో వినియోగించడం వంటి పద్ధతులను అవలంబించడం ద్వారా లాభాలు పొందవచ్చని వివరించారు. గ్రామాల్లో టమ్‌టమ్ ద్వారా విస్తృత అవగాహనణ కార్యక్రమాలు నిర్వహించి ప్రతి రైతుకు సమాచారం చేరేలా చేయాలని కోరారు."మన గ్రామం – మన బాధ్యత,మన భవిష్యత్తు – మన చేతుల్లోనే" అంటూ పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అవగాహన కోసం నెక్కొండ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై ఎం.మహేందర్ సూచించారు.

# ఉర్సు చెరువు బండ్ సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి





### జిల్లా కలెక్టర్ల ఆదేశం

**వరంగల్ , మే 23, అక్షర సవాల్ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉర్సుగుట్ట -- రంగసముద్రం చెరువు బండ్ సుందరీకరణ మరియు అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్లు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. చెరువు బండ్ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో బల్దియా ఇంజినీర్ సంతోష్ బాబు, సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, తహసిల్దార్ ఇక్బాల్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# "చొప్పలు కాల్చొద్దు.. నేల సారాన్ని కాపాడండి"

### రైతులకు వ్యవసాయ అధికారి రజిత బన్న సూచనలు

### పంట మార్పిడి, సేంద్రియ సాగుపై అవగాహన

**నల్లబెల్లి, మే 23 అక్షర సవాల్:** వ్యవసాయ భూముల సారాన్ని కాపాడేందుకు రైతులు పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి రజిత బన్న పిలుపునిచ్చారు. నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామంలో నిర్వహించిన "ఏరువాక రైతు సాగుబడి" కార్యక్రమంలో ఆమె రైతులకు సాగు విధానాలపై కీలక సూచనలు చేశారు. మొక్కజొన్న, వరి చొప్పలను కాల్చకుండా రోటోవేటర్‌తో కలిపి సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా వేస్ట్ డికంపోజర్ ఉపయోగించి భూమిలో కలపాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం తగ్గకుండా ఉండి నేల సారవంతం పెరుగుతుందని



వివరించారు. జీలుగ, పెసర్లు వంటి పచ్చిరొట్టె ఎరువుల పంటలను సాగు చేసి వాటిని పొలాల్లో దున్నుకోవడం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ పప్పుజాతి పంటల సాగును పెంచాలని రైతులకు సూచించారు. పత్తి, మిరప, మక్క చేల్లో పప్పుజాతి మొక్కలను అంతర పంటలుగా వేయడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా నేల సారం పెరిగి మిత్ర పురుగులు అధికంగా పెరుగుతాయని చెప్పారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ఆహార పంటల సాగు వైపు మళ్లాలని కోరారు. గ్రామ సర్పంచ్ పులి రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, అగ్రికల్చర్ యూనివర్సిటీ అందించే కందుల విత్తనాలను రైతులు వినియోగించుకొని లాభదాయక సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శివకుమార్‌తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఈ-గ్రామ్ స్వరాజ్‌పై ప్రత్యేక శిక్షణ

### జీపీడీపీ ప్రణాళికల్లో పారదర్శకత తప్పనిసరి

### డీఎల్పీవో వేదవతి హెచ్చరిక

**గీసుకొండ, మే 23 అక్షర సవాల్:** గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పారదర్శకంగా అమలు చేసి, ప్రతి పైసా వినియోగాన్ని ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని వరంగల్ డివిజనల్ పంచాయతీ అధికారి వేదవతి సూచించారు. జీపీడీపీ ప్రణాళికల అమలులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గీసుకొండ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ వినియోగం, 15వ ఆర్థిక సంఘం నిధుల ఆన్‌లైన్ చెల్లింపులు, డిజిటల్ సిగ్నేచర్ విధానం, చెక్ ప్రాసెసింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదవతి మాట్లాడుతూ గ్రామ సభల్లో ఆమోదించిన అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు సమన్వయంతో నిర్ణీత గడువులోపు ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిధుల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ దివ్య గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం పనుల ఎంపిక, అంచనా వ్యయాలు, టైడ్-అన్‌టైడ్ నిధుల వినియోగ విధానం వంటి అంశాలను వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ఫండ్ ట్రాన్స్ఫర్ ఆర్డర్ ద్వారా సురక్షితంగా చెల్లించే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. ముందుగా ఆమోదించిన జీపీడీపీ ప్లాన్ ప్రకారం వర్క్ ఐడీలు సృష్టించి, వోచర్లు రూపొందించి, సర్పంచ్-ఉపసర్పంచ్ డిజిటల్ టోకెన్లతో బిల్లులను నేరుగా వెండర్ ఖాతాలకు జమ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి పాక శ్రీనివాస్,



పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి,....

### సి ఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి

### ఎల్ ఎచ్ పి ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ నాయక్ రామ చంద్రు నాయక్ తో భేటీ..





**హైదరాబాద్, మే 22:** హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్‌ను లంబాడ హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, బీసీ సంఘం రాష్ట్ర సెక్రటరీ ప్రవీణ్ ముదిరాజ్, శీను కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌కు మంత్రి పదవి కల్పించాలని కోరుతూ పుష్పగుచ్ఛం, శాలువాతోసత్కరించారు. అనంతరం సునిల్ నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి లంబాడీ, గిరిజన, దళిత, బీసీ వర్గాల ఓట్లు కీలకమయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు ఒక్క మంత్రి పదవి కూడా లంబాడీలకు ఇవ్వలేదని, కాబట్టి త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ సైనికుడిగా పనిచేస్తున్న డాక్టర్ రాంచంద్రు నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి శ్రేణులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు సీపీఐ పోరుబాట

## ఇంటింటికీ సంక్షేమ పథకాల దరఖాస్తుల పంపిణీ

**నల్లబెల్లి, మే 23 అక్షర సవాల్:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల దరఖాస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. మండల కేంద్రం నల్లబెల్లిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గౌడ కాలనీలో మహిళలకు దరఖాస్తు ఫారాలను అందజేస్తూ, ఈ నెల 26న ఎంపీడీవో కార్యాలయం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రాలు పంపనున్నట్లు నాయకులు తెలిపారు. ప్రతి కుటుంబం దరఖాస్తులు నింపుకొని తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన హామీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద



ప్రతి మహిళకు నెలకు రూ.2500, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం, నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని గుర్తుచేశారు. అలాగే స్థలంలేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు స్థలాలు, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం కింద ఆర్థిక సహాయం వంటి అంశాలను దరఖాస్తుల్లో పొందుపరిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, మండల నాయకులు పరికి కోరనేలు, మామిళ్ల పెద్ద ఐలయ్య, వైనాల జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిన్న రెరా చైర్మన్ సత్యనారాయణ..

# నేటి విద్యా కమిషన్ చైర్మన్ మురళి..

### ఎందుకు రాజీనామాలు చేశారు.. ఏం జరుగుతోంది..

**హైదరాబాద్, మే 23:** సాధారణంగా ప్రభుత్వంలో అధికారులు రాజీనామా చేయడం అరుదుగా జరుగుతూ ఉంటుంది. రాజీనామా కోణాన్ని మీడియా లోతుగా అధ్యయనం చేస్తూ ఉంటుంది. అసలు విషయాన్ని బయటపడుతూ ఉంటుంది. ఒకవేళ వ్యక్తిగత ఆరోగ్యం బాగా లేకపోతే లేదా ప్రభుత్వంతో ఇబ్బందులు ఎదురైతే అధికారులు రాజీనామా చేస్తారు. ఒక స్థాయి అధికారులకు ప్రభుత్వంలో అండదండలు బాగా ఉంటాయి. ముఖ్యమంత్రి స్థాయిలో పరిచయాలు ఉంటాయి కాబట్టి జీతభత్యాలు కూడా అంతకుమించి అనే స్థాయిలో ఉంటాయి. మంచి హోదా కూడా ఉంటుంది కాబట్టి అధికార దర్పాన్ని కూడా బ్రహ్మాండంగా అనుభవించవచ్చు. ఇన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ రాజీనామా చేశారంటే కచ్చితంగా అనుమానించాల్సిందే. పైగా సర్వీస్ కూడా ఉన్నప్పుడు ఇటువంటి రాజీనామా వ్యవహారాలను సాధారణంగా చూడకూడదు. భారత రాష్ట్రపతి అధికారంలో ఉన్నప్పుడు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. అప్పట్లో ఈ విషయం ఒక సంచలనం. ఆ తర్వాత ఆయన ఏపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు విద్యా కమిషన్ చైర్మన్గా పని చేశారు. అక్కడ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పాఠశాలలను అభివృద్ధి చేసి.. సరికొత్త సౌకర్యాలు కల్పించారు. డ్రాప్ అవుట్లు తగ్గేలా చూశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేశారు.. తద్వారా ఏపీ ప్రభుత్వ పాఠశాలలో ప్రమాణాలు పెరిగాయి. విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించారు. అది నచ్చి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మురళికి విద్యా కమిషన్ చైర్మన్గా పదవి కల్పించారు. ఇది క్యాబినెట్ ర్యాంకు హోదా పదవి. ఇటీవల తెలంగాణ విద్యా విధానంలో చేపట్టాల్సిన మార్పుల గురించి మురళి ప్రభుత్వానికి ఒక నివేదిక అందించారు. అందులో ప్రభుత్వ టీచర్ల జీతాలు ఎక్కువగా ఉన్నాయని.. వాటిని పెంచాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పదవ తరగతి, ఇంటర్ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని.. అవసరమైతే పదో తరగతి విద్యను కాస్త ప్లస్ 2 గా మార్చి.. తమిళనాడు, కేరళ స్థాయిలో విద్యా విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మురళి సమర్పించిన




నివేదిక తెలంగాణ రాజకీయాలలో కలకలం సృష్టించింది. ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి మురళి నివేదికను నెగిటివ్గా ప్రచారం చేయడం మొదలుపెట్టింది.. ఈ నివేదిక పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కాస్త ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. మురళి నివేదిక వల్ల ప్రభుత్వ టీచర్లలో ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావన కలిగిందని సమాచారం. అప్పటినుంచి మురళి, ప్రభుత్వం మధ్య విభేదాలు ఏర్పడ్డాయని ప్రచారం జరిగింది. కొంతకాలంగా మురళి కూడా తన మీద వస్తున్న విమర్శల పట్ల నిరాశ లో ఉన్నారని తెలుస్తోంది. అందువల్లే ఆయన తన పదవికి శుక్రవారం రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. రాజీనామా లేఖను ముఖ్యమంత్రి కార్యాలయానికి ఆయన పంపించారు.. మురళి కంటే ముందు రెరా చైర్మన్ సత్యనారాయణ కూడా తన పదవికి రాజీనామా చేశారు.. వాస్తవానికి రెరా అనేది అత్యంత డిమాండ్ ఉన్న విభాగం. ఒక రకంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి గుండెకాయ లాంటిది. ఈ పదవిలో సత్యనారాయణ ను రేవంత్ రెడ్డి ఏరికోరి నియమించారు. తనమీద ఎన్ని రకాల ఒత్తిళ్లు వచ్చినప్పటికీ రేవంత్ రెడ్డి ఏమాత్రం తగ్గకుండా సత్యనారాయణ ను నియమించారు. కొంతకాలం పాటు ఆయన కూడా సక్రమంగానే పనిచేశారు. అయితే ఇటీవల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మీద గులాబీ పార్టీ నెగటివ్ ప్రచారం చేయడం మొదలుపెట్టింది. సత్యనారాయణ మీద కూడా లేనిపోని ఆరోపణలు చేసింది. రాష్ట్ర విద్యా బడ్జెట్ను ప్రస్తుతమున్న స్థాయి నుంచి 18 శాతానికి పెంచాలని కమిషన్ సిఫార్సు చేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,000 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా మార్చి, వాటిలో ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ల్యాబ్‌లు, లైబ్రరీలు, స్పోర్ట్స్ సౌకర్యాలు , బస్సు కనెక్టివిటీ కల్పించాలని ప్రతిపాదించింది. విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు 11వ తరగతి అంటే ఇంటర్ ప్రథమ సంవత్సరం బోర్డు పరీక్షలను రద్దు చేయాలని కీలక సూచన చేసింది. టీచర్ల విషయంలో కమిషన్ చాలా కఠినమైన సంస్కరణలను ప్రతిపాదించింది. ఇకపై ఉపాధ్యాయులకు ఆటోమేటిక్ ప్రమోషన్లు ఉండకూడదని, ప్రతి ఐదేళ్లకోసారి వారి పనితీరును సమీక్షించాలని పేర్కొంది. ఒకవేళ పనితీరు బాగోలేకపోతే, మెరుగుపరుచుకోవడానికి రెండేళ్ల సమయం ఇచ్చి, అప్పటికీ మార్పు రాకపోతే వారిని సర్వీస్ నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. అయితే, ఈ నిబంధనలు కేవలం భవిష్యత్తులో నియమితులయ్యే కొత్త టీచర్లకే వర్తిస్తాయని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 80 శాతానికి పైగా బోధనా పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, 86 శాతం కాలేజీలకు ఎన్ఏఏసీ గ్రేడింగ్ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను అదుపు చేసేందుకు ఒక స్టాట్యూటరీ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే ఐఐటీ–జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు మరియు హాస్టళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నివేదికలో పేర్కొంది. రాజీనామా లేఖలో ఆకునూరి మురళి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను పూర్తి చేశాను, అందుకే తప్పుకుంటున్నాను అని ప్రకటించినప్పటికీ, ఈ విప్లవాత్మక సిఫార్సులను అమలు చేసే విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఆయనకు ఏవైనా అసంతృప్తి ఉందా అనే చర్చ ప్రస్తుతం విద్యా వర్గాల్లో సాగుతోంది. పైగా ప్రభుత్వ పెద్దల నుంచి అతడికి సహకారం అందకపోవడంతో.. కొన్ని వ్యవహారాలలో ఆయనను కలగజేసుకోకూడదని చెప్పడంతో.. తట్టుకోలేక తన పదవికి రాజీనామా చేశారు. సత్యనారాయణ రాజీనామాను మర్చిపోకముందే.. ఆకునూరి మురళి రాజీనామా చేయడం.. సంచలనం కలిగిస్తోంది. మరి దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా వివరణ ఇస్తుంది.. అనేది చూడాల్సి ఉంది.

## నలగండ్లలో ఆకాశాన్ని తాకుతున్న

# భూముల ధరలు..

**హైదరాబాద్, మే 23:** నలగండ్ల రియల్ ఎస్టేట్ రంగం మధ్య తరగతి అంచనాలు దాటి ఆకాశాన్ని తాకుతోంది. అమ్మకాలు లేక పోయినా ధరలు దిగనంటున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకున్న స్దలాలకు డిమాండ్ పీక్స్ కు చేరుకుంది. ఓవైపు గచ్చిబౌలి, మరోవైపు బీహెచ్ఈఎల్, లింగంపల్లి మధ్యలో రియల్ వెలుగులతో ఎగసిపడుతున్న ప్రాంతం నలగండ్ల. ఓ పదేళ్ల క్రితం నలగండ్లలో ఇళ్లు కొనాలి అంటే వామ్మో అంత దూరం ఎందుకులే అనుకునేవాళ్లు. ఇప్పుడు అదే నలగండ్లలో వామ్మో సొంతిల్లు కొనగలమా అంటూ నోరెళ్ల బెట్టే పరిస్దితి వచ్చేంది. అంతలా పదేళ్ల కాలంలో చూస్తూ చూస్తూనే నలగండ్ల రియల్ రంగం ఊహించని స్దాయిలో ఎదిగింది. నలగండ్ల సమీపంలో ముళ్లపొదలు, నిర్మానుష్య ప్రాంతాలు సైతం బుల్డోజర్లతో తవ్వి ప్రధాన రహదారులుగా మార్చేస్తున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటూ విదేశాలలో వారి పిల్లలు స్దరపడ్డారంటే కచ్చితంగా నలగండ్లలో కనీసం ఓ వందగజాల స్దలం లేదా లగ్జరీ అపార్ట్మెంట్‌లో ఖరీదైన ఫ్లాట్ ఇప్పటికే కొనేసి ఉంటారు. ఒకప్పుడు చేతినిండా బ్లాక్ మనీ ఉన్నవాళ్లు సైతం ఇలా నలగండ్లలో కారుచౌకకు భూములు భారీగా కొనేశారు. ఇప్పుడు అవే భూములు బంగారాన్ని తలదన్నేలా డిమాండ్ పలుకుతున్నాయి. విశాలమైన రోడ్లు, గ్రీనరీ మధ్యలో కాలనీలతో కాలుష్యానికి దూరంగా ఉన్న నలగండ్ల,రియల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. విదేశాల?లో ఉద్యోగాలు, బ్లాక్ మనీ పెట్టుబడిగా పెట్టేవారికి నల్లగండ్ల అనుకూల ప్రాంతంగా మారింది. నలగండ్లలో స్థలాల రేట్లు ఇలా ఉన్నాయి. ప్రాంతం/లేఅవుట్ రకం సగటు గజం ధర 100 గజాలల అంచనా ధర వెంచర్ లోపలి ప్లాట్లు లక్ష నుంచి లక్షన్నర కోటి నుంచి కోటిన్నర పెట్టాలి. హుడా లే



అవుట్స్ లక్షన్నర పైమాటే కోటిన్నర పైగా పెట్టాలి రోడ్డుకు సమీపంలో ఉన్న ప్లాట్లు రెండు లక్షల పై మాటే రెండు కోట్లు ఖర్చు చేయాలి మెయిన్ రోడ్డుకు ఆనుకొని ప్లాట్ ఉంటే మూడు లక్షలపై మాటే మూడు కోట్లపైగా పెట్టాలి. నలగండ్ల పరిసర ప్రాంతాల్లో గజం భూమి కొనాలంటే అక్షరాల లక్ష పెట్టాల్సిందే. వందగజాలు జాగా మీ సొంతం కావాలంటే కోటికిపైగా చెల్లించుకోవాల్సిందే. అదికూడా వెంచర్ కాస్త లోపలకు ఉన్న ప్లాట్లు మాత్రమే మీకు దక్కుతాయి. అలా కాదని రోడ్డు కాస్త సమీపంలో వంద గజాలు భూమి కొనాలనుకుంటే తక్కువలో తక్కువగా 2కోట్లు పైమాటే. తెల్లాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు నలగండ్లకు దగ్గరగా ఉండంతో ఐటీ ఉద్యోగులు నలగండ్లపై కన్నేశారు. ట్రాఫిక్ కష్టాల లేకుండా త్వరగా ఆఫీసులకు వెళ్లాంటే నలగండ్ల అనువైన ప్రాంతం కావడంతో గత రెండేళ్ల కాలంలో ఇక్కడ రియల్ భూమ్ పిక్స్‌కు చేరుకుంది. ఇక్కడున్న హుడా లేవుట్‌లో గజం భూమి లక్షలకు పైమాటే అదే రోడ్డుకు సమీపంలో ఉంటే రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. గోపనపల్లి పరిసర ప్రాంతాల నుంచి గచ్చిబౌలి వచ్చేవారికి నల్లగండ్ల షార్ట్ కట్‌గా మారింది. గత ఏడాది కాలంగా ఇక్కడ రియల్ రంగం అత్యంత వేగంగా పరుగులు పెడుతోంది. నలగండ్ల రియల్ ఎస్టేట్ రంగం మధ్య తరగతి అంచానాలు దాటి ఆకాశాన్ని తాకుతోంది. అమ్మకాలు అంతలా లేక పోయినా ధరలు మాత్రం కిందికి దిగనంటున్నాయి. సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలంటే, అపార్ట్మెంట్ లలో ఫ్లాట్లు కొనండి కానీ, ఇండివీడ్యూవల్ హౌస్ అంటూ కనీసం ఆలోచనలకు కూడా రానివ్వొద్దంటున్నారు స్దానికులు. ప్రధాన రహదారికి ఆనుకున్న స్దలాలకు డిమాండ్ పీక్స్ కు చేరుకుంది. వీటిలో గజం స్దలం 3లక్షలు, వంద గజాలు మూడు కోట్లకుపైగా అమ్మకాలు సాగుతున్నాయంటే పరిస్దితి అర్దం చేసుకోవచ్చు. రియల్ ఎస్టేట్ దెబ్బకు నలగండ్ల సమీప ప్రాంతాల్లో ఇంటి అద్దెలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఒకప్పుడు మహా అయితే నెలకు 5వేలు అద్దె ఉండే సింగిల్ బెడ్ ఇళ్లు ఇప్పుడు 15వేలు దాటింది. అదే అపార్ట్మెంట్‌లో మంచి ఫ్లాట్‌లో అద్దెకు ఉండాలంటే అర లక్ష నెలకు అద్దెకు చెల్లించాల్సిందే. ఐటీ ఉద్యోగులకు పెట్టుబడి పెట్టేందుకు అత్యంత అనుకూలమైన ప్రాంతం కావడంతో హైదరాబాద్ నగరంలో నలగండ్ల రియల్ భూమ్ తగ్గేదే లే అన్నట్లుగా దూసుకుపోతోంది. నల్లగండ్లకు సమీపంలోనే ప్రధాన కార్యాలయాలు ఉండటంతో ఇక్కడ ఐటీ ఉద్యోగులు సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. సొంత ఇళ్లు, ఫ్లాట్లు, స్దాలాలు ఇలా కనిపిస్తే కొనేద్దాం అనేంతలా ఐటీ ఉద్యోగులు నల్లగండ్లపై ఆశక్తి చూపడంతో నల్లగండ్ల చుట్టు ప్రక్కల ప్రాంతాలు సైతం వేగంగా అభివృద్ది చెందుతున్నాయి.

# కమర్షియల్ రియల్ ఎస్టేట్లో కింగ్

**హైదరాబాద్, మే 23:** ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణం ఉంది. కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతున్నాయి. ఉన్న ఉద్యోగులను సైతం తొలగిస్తున్నాయి. సాధ్యమైనంతవరకు మెరుగైన టెక్నాలజీతో.. తక్కువ మ్యాన్ పవర్ తో పనులు చేయించుకుంటున్నాయి. దీంతో కంపెనీల పెట్టుబడులు చాలా వరకు తగ్గిపోయాయి. కార్పొరేట్ ఆఫీస్ లీజు కూడా నేల చూపులు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది హైదరాబాద్. కమర్షియల్ రియల్ ఎస్టేట్లో హైదరాబాద్ కింగ్ లాగా దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో కార్యాలయాల స్థలాల లీజింగ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా లక్ష నుంచి పదిలక్షల విస్తీర్ణం వరకు విస్తీర్ణం ఉన్న కార్యాలయాలలో ఆయా సంస్థలు తమ పనులు మొదలుపెడుతున్నాయి. భారీ ధరకు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ప్రస్తుత ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్ నగరంలో 69% అభివృద్ధి నమోదయింది. గతంలో ఇది 40 శాతం వరకు ఉండేది. గత ఏడాది ఇదే సమయానికి 26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి లీజింగ్ జరిగింది. ఈ సంవత్సరం ఈ సమయానికి 44 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి అది పెరిగింది. అదే కాదు గడిచిన మూడు నెలల్లో ఏకంగా 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాల లావాదేవీలు జరిగాయి. ఇందులో భారీ కార్యాలయాల స్థలాల వాటా 75% గా ఉంది. ఇందులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న కార్యాలయాల వాటా 8 శాతం ఉంది. ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. మిడిల్ రేంజ్ లో కార్యాలయాల స్థలాలు 50వేల నుంచి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశాయి. వీటి వాటా ఏకంగా 17 శాతం ఉంది. ఇక 10 లక్షల చదరపు అడుగుల లీజింగ్ భాగంలో కూడా ఒప్పందం కుదిరింది. దీని వాటా కూడా రెండు నుంచి మూడు శాతం వరకు ఉండే అవకాశం ఉంది. ఇటీవల ఉబర్ కంపెనీ గ్లోబల్ క్యాబబులిటీ సెంటర్ విస్తరణ కోసం హైదరాబాద్ ఐటి కారిడార్ పరిధిలోని మీనాక్షి ఎకో పార్కులో ఏకంగా 9.1 లక్షల చదరపు అడుగుల కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. జనవరిలో వీరుని లీజుకు తీసుకుంది. దాదాపు మొత్తం 10 అంతస్తులో ఈ సంస్థ కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. ప్రతి నెల దీనికి 5.86 కోట్ల అద్దె చెల్లిస్తోంది. చదరపు అడుగుకు 65 రూపాయల అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. ప్రతి మూడు సంవత్సరాలకు 15% పెరుగుతుంది. పది సంవత్సరాలపాటు లీజు ఒప్పందం ఉంటుంది. మొత్తంగా 10 సంవత్సరాల వరకు చెల్లించే ఏకంగా 839 కోట్ల వరకు ఉంటుంది.. హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద లీజింగ్ ఒప్పందంలో ఇది ఒకటి. హైదరాబాద్ నగరంలో స్థలాలు విస్తీర్ణంగా ఉండడం.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు సాగించే అవకాశం ఉండడం.. ఐటీ రంగం.. ఫార్మా రంగం అద్భుతంగా ఉండడంతో ఫైనాన్స్.. మొబిలిటీ వంటి రంగాలలో దిగ్గజాలుగా ఉన్న సంస్థలు హైదరాబాద్ నగరం వైపు దృష్టిసారిస్తున్నాయి.

## పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి మోదీ ప్రభుత్వం దోచుకుంటోంది..

- మొదటి పేజీ తరువాయి

సుమారు రూ.17 తగ్గాయని ఆయన తెలిపారు. చమురుపై జర్మనీ పన్నులు తగ్గించడంతో ఇంధన ధరలు లీటరుకు రూ.17 నుంచి రూ.19 వరకు తగ్గిపోయాయని వెల్లడించారు. అలాగే యూకేలో ప్రతి ఇంటికీ చమురు సంబంధిత ఆర్థిక సహాయంగా ప్రభుత్వం 100 పౌండ్లు అందించడంతో పాటు ఇంధనం, విద్యుత్ రెండింటిపైనా పన్నులను తగ్గించిందని ఖర్గే చెప్పుకొచ్చారు. ఐర్లాండ్ 250 మిలియన్ యూరోలను సాయం కింద ప్రజలకు అందించిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు తెలిపారు. దీంతో పెట్రోల్ ధర లీటరుకు సుమారు 0.15 యూరోలు, డీజిల్ ధర లీటరుకు 0.20 యూరోలు తగ్గాయని చెప్పారు. మన దేశంలో మాత్రం రేట్లు పెంచుతూ దోపిడీ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దోపిడీ ద్వారా వస్తున్న సొమ్ము ఎవరికి చేరుతోంది? అంటూ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో నాయకత్వ సంక్షోభం చాలా స్పష్టంగా కనిపిస్తోందని, ఈ విషయాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు గ్రహించారని మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు.

## వికసిత భారత్ లక్ష్యంలో యువతదే కీలక పాత్ర

- మొదటి పేజీ తరువాయి



ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా AI, IoT వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.

**అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్...**

భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం–శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

## బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు..

మంత్రి పొంగులేటి సెటైర్లు



**హైదరాబాద్, మే 23 :** మాజీమంత్రి హరీశ్‌రావుపై.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి (తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు. 'బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.

## "భారత్ సమాజ సేవ రత్న అవార్డు 2026" అందుకున్న ఏ. పద్మాచారి

**మాజీ కేంద్ర మంత్రుల సమక్షంలో ఘన సత్కారం**

**సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక అవార్డు ప్రదానం**

**సమాజ సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతానన్న పద్మాచారి**

**న్యూఢిల్లీ:** సమాజ సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న ఏ. పద్మాచారి గారికి ప్రతిష్టాత్మకమైన "భారత్ సమాజ సేవ రత్న అవార్డు -- 2026" ప్రదానం చేయబడింది. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ అవార్డును ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్ ఘనంగా అందజేసింది. ఈ అవార్డును మాజీ కేంద్ర మంత్రి ప్రొఫెసర్ మురళీ మనోహర్ జోషి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్ (ఎన్సీబీసీ ) చైర్మన్ జనార్దన్ సింగ్ సిగ్రీవాల్, ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ సురేందర్ చౌదరి, ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జ్ఞానేంద్ర విశ్వకర్మ, అలాగే హెచ్.హెచ్. మహారాజా శ్రీమంత్ రామ్లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమం, దేశ నిర్మాణానికి కృషి చేస్తున్న జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, సామాజిక సేవకులు, ఎన్జీవోలు, బ్యూరోక్రాట్లు మరియు వినోద రంగ ప్రముఖులను ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం సత్కరిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా ఏ. పద్మాచారి మాట్లాడుతూ, తన సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవించిన ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను, సమాజ సేవలో ఇంకా ఎక్కువ అంకితభావంతో పనిచేయాలనే ప్రేరణను ఇచ్చిందని పేర్కొన్నారు

# బండి ఫ్యూచర్ ఏంటీ...?



**కరీంనగర్, మే 23:**తెలంగాణ బీజేపీలో ఫైర్ బ్రాండ్ గా పేరు తెచ్చుకున్న బండి సంజయ్ కుమార్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. అమిత్ షా , మోదీల నమ్మకస్తుడిగా, హిందుత్వ వాదాన్ని బలంగా వినిపించే నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, ఇటీవలి కొన్ని పరిణామాలు ఆయన ప్రమోషన్‌కు అడ్డంకిగా మారుతాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మోదీ 3.0 క్యాబినెట్‌లో ప్రస్తుతం సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు త్వరలో జరగబోయే విస్తరణలో కేబినెట్ ర్యాంక్ దక్కుతుందనే ప్రచారం ఒకవైపు సాగుతోంది. తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు ఆయన వేసిన పునాదులు, క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఆయనకున్న క్రేజ్ దీనికి ప్రధాన కారణాలు. అయితే, ఈ సమీకరణాల్లో ఆయన కుమారుడికి సంబంధించిన కేసు పరిణామాలు హైకమాండ్ నిర్ణయంపై ప్రభావం చూపుతాయా అన్నది అసలు ప్రశ్న. ఒకవేళ ఆయనకు ప్రమోషన్ ఇస్తే, పార్టీ క్రమశిక్షణ కంటే విన్నింగ్ హార్స్ కే ప్రాధాన్యత ఇచ్చారనే విమర్శలు వచ్చే అవకాశం ఉంది.తెలంగాణలో బలమైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడం బండి సంజయ్‌కు ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్. రాష్ట్రంలో బీసీ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ వంటి నేతలతో బ్యాలెన్స్ చేయాలంటే, బండి సంజయ్‌ను కేంద్రంలో కీలకమైన పదవిలో ఉంచడం ఢిల్లీ పెద్దలకు అనివార్యం. కేవలం పనితీరునే కాకుండా, 2028లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ హైకమాండ్ ఆయనను పక్కన పెట్టే సాహసం చేయకపోవచ్చు.బండి సంజయ్ కుమారుడు పోక్సో కేసులో ఇరుక్కోవడం ఆయనకు సమస్యగా మారింది. బీజేపీ ఎప్పుడూ వారసత్వ రాజకీయాలకు , అక్రమాలకు వ్యతిరేకమని చెబుతుంటుంది. ఈ వివాదం సమయంలో ఆయనకు కేబినెట్ ర్యాంక్ ఇస్తే, ఆరోపణలు ఉన్న కుటుంబ సభ్యుల పట్ల పార్టీ మెతక వైఖరి అవలంబిస్తోందనే సంకేతాలు వెళ్తాయి. ఒకవేళ ఇదే కారణంతో ఆయనను తప్పిస్తే లేదా ఉన్న పదవిలోనే ఉంచితే మాత్రం, అది సంజయ్ రాజకీయ ప్రస్థానానికి ఒక స్పీడ్ బ్రేకర్ లాంటిదే అని విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకప్పుడు తెలంగాణ బీజేపీ అంటే బండి సంజయ్ అన్నట్లు ఉండేది. కానీ ఇప్పుడు ఈటల రాజేందర్ జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతున్నారు, రఘునందన్ రావు వంటి వారు కూడా రేసులో ఉన్నారు. ఈ క్రమంలో తన ఉనికిని కాపాడుకోవడానికి సంజయ్ తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. పార్టీపై ఎంతో నమ్మకంగా ఉన్నానని, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా అదిష్టానం ఏ బాధ్యత ఇచ్చినా చేస్తానని ఆయన చెబుతున్నప్పటికీ, లోపల మాత్రం ప్రమోషన్ కోసం గట్టిగానే ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కేబినెట్ మంత్రులుగా ఉండేవారికి కేవలం దూకుడు మాత్రమే కాదు, పరిపాలనా దక్షత కూడా ఉండాలని అధిష్టానం భావిస్తోంది. బండి సంజయ్ కేవలం హిందుత్వ ఫేస్ గానే మిగిలిపోతారా లేక అడ్మినిస్ట్రేటర్ గా గుర్తింపు తెచ్చుకుంటారా అనే దానిపైనే ఆయన పదోన్నతి ఆధారపడి ఉంటుంది.బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఒక సంధి కాలంలో ఉంది. సామాజిక సమీకరణాలు ఆయనను కాపాడుతాయా లేక వివాదాలు ఆయన వేగాన్ని తగ్గిస్తాయా అన్నది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, తెలంగాణలో బీజేపీ దూకుడు తగ్గకూడదంటే బండి సంజయ్ వంటి మాస్ లీడర్ కేంద్రంలో కీలక పాత్రలో ఉండటం పార్టీకి అవసరమేనని క్యాడర్ నమ్ముతోంది.

# మిల్లర్లపై నిబంధనల కత్తి....



**హైదరాబాద్, మే 23:**ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్టుగా ఉంది. తాము నిర్వర్తించాల్సిన బాధ్యతలను సరిగా నిర్వహించకుండా, రాష్ట్రంలోని ప్రైవేటు రైస్ మిల్లర్లపై పడుతుండటంతో.. నిర్దిష్ట సమయంలోగా బియ్యాన్ని అటు ఎఫ్‌సీఐకి, ఇటు సివిల్ సప్లకి సరఫరా చేయలేక, చివరికి డిఫాల్టర్లుగా మిగులుతున్నామని మిల్లర్లు ఆవేదన చెందుతున్నారు.ఇలా డిఫాల్టర్లుగా మారకుండా ఉండేందుకు రైస్ మిల్లర్లు పక్కదారిపట్టేలా ప్రభుత్వమే నిబంధనల పేరుతో తమ భవిష్యత్తుతో ఆటలాడుకుంటుందని వారంటున్నారు. పైగా తాము పాటించని నిబంధనలను బూచిగా చూపెడుతూ, 25 శాతం పెనాల్టీని.. దానికి తోడు గా 12 శాతం వడ్డీని కూడా వసూలుచేస్తూ, తమ నడ్డి విరుస్తున్నట్టు రైస్ మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. దీనితో వీటన్నింటినీ భరించే శక్తి లేక, అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నట్టు మిల్లర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.ప్రతి సీజన్‌లోనూ ధాన్యం సరఫరా నుంచే రైస్ మిల్లర్లపై ఒత్తిడి మొదలవుతుందని వారంటున్నారు. నిజానికి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయాలి. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం బియ్యాన్ని మిల్లర్లు ఇవ్వాలి. బియ్యాన్ని మిల్లర్లు రవాణా చేసేటప్పుడు గోదాముల్లో సరైన స్థలం ఉండాలి.ఈ మూడు అంశాల్లో ప్రభుత్వ అధికారులు, సివిల్‌సప్ల విభాగాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే.. రైస్ మిల్లర్లు నిర్దేశించిన ప్రమాణాలమేరకు, నిర్దిష్టమైన సమయంలోగా బియ్యాన్ని అప్పగిస్తారు. అయితే ఈ మూడు అంశాలనుకూడా ప్రభుత్వం తరఫున ఎవరూ సక్రమంగా పాటించడం లేదు. దీనితోనే అసలైన తకరారు మొదలవుతుందని రైస్ మిల్లర్లు అంటున్నారు. ధాన్యం నాణ్యతతో ఉండటం లేదు. 3 శాతం వరకే ముక్కిన/రంగు మారిన ధాన్యాన్ని ఇవ్వాల్సి ఉండగా.. రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా.. ఇది కాస్తా 15శాతం వరకు వెళుతోంది. క్వింటాళు ధాన్యంలో 15 శాతం.. అంతకంటే ఎక్కువగాకూడా ముక్కిన/రంగుమారిన ధాన్యం ఉంటోంది. సన్నరకం ధాన్యం నుంచి 10 శాతం బ్రోకెన్ శాతంతో 67 శాతం బియ్యాన్ని ఇవ్వడం అసాధ్యమని మిల్లర్లు నెత్తినోరు కొట్టుకుంటున్నారు. టెస్ట్ మిల్లింగ్ చేయమంటున్నారు. కానీ ప్రభుత్వం చేయడం లేదు. అటు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు గానీ, ఇటు సివిల సప్ల సంస్థకు గానీ బియ్యాన్ని సరఫరా చేసే సమయానికి గోదాములు ఖాళీగా ఉండటం లేదు. దీనితో ఆలస్యం అవుతోంది.ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలకు విరుద్ధంగా పరిస్థితులు ఉండటంతో.. రైతులు సకాలంలో బియ్యాన్ని సరఫరా చేయలేకపోతున్నారు. కొంత సర్దుబాటు చేసి పంపించిన బియ్యాన్నికూడా గోదాముల్లో ఖాళీలేదని వెనక్కి పంపిస్తుండటంతో.. తిరిగి తిరిగి.. మిల్లర్లకే చుట్టుకుంటోంది. నిర్దేశించిన గడవులోగా బియ్యాన్ని సరఫరా చేయకపోవడంతో.. డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నారు. పైగా ఇవ్వాల్సిన బియ్యాన్ని 25 శాతం పెనాల్టీతో.. అదనంగా మరో 12 శాతం వడ్డీతో చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించడంతో.. రైస్ మిల్లర్ల పరిస్థితి పెనంమీది నుంచి పొయ్యిలో పడ్డట్టుగా అవుతోంది.ఉదాహరణకు.. 100 క్వింటాళ్ల బియ్యాన్ని నిర్దేశించిన గడువులోగా ఎఫ్‌సీఐకిగానీ, సివిల్ సప్లకిగానీ సరఫరా చేయకపోతే.. సదరు మిల్లరుపై 25 శాతం పెనాల్టీ విధిస్తున్నారు. అంటే మొత్తం 125 క్వింటాళ్ళ బియ్యం ఇవ్వాలన్నమాట. పైగా దీనికి అదనంగా మరో 12 శాతం వడ్డీ విధిస్తారు. అసలు సరఫరాచేసే ధాన్యం నాణ్యంగా లేకపోవడం, ఏవిధంగా చూసినా.. 67 శాతం రాని బియ్యాన్ని ఇవ్వాలంటున్న అధికారులు.. ఇవ్వకపోతే 25 శాతం పెనాల్టీ, అదనంగా 12 శాతం వడ్డీతో తమ నడ్డి విరుస్తున్నారని రైస్ మిల్లర్లు వాపోతున్నారు.

**సుమారు 400 డిఫాల్ట్ రైస్ మిల్లులు..**

ఇలాంటి పరిస్థితుల ప్రభావంతోనే.. రాష్ట్రంలో డిఫాల్టర్ రైస్ మిల్లుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయని రైస్ మిల్లర్ల సంఘం నాయకులు నెత్తినోరు బాదుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 400 వరకు డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు ఉన్నాయని వారంటున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా.. తమ వైపు ఉన్న ఇబ్బందులు, కష్టాలు, సమస్యలను పట్టించుకున్నపాపాన పోలేదంటూ వాపోతున్నారు.ఈ కష్టాలు, నష్టాలు, పెనాల్టీలు, వడ్డీల బారిన పడకుండా ఉండేందుకు పలువురు మిల్లర్లు అక్రమాలకు తెరతీస్తూ.. పక్కదాని పడుతున్నారని వారంటున్నారు. నిబంధనల బూచి చూపెట్టి.. తమ నుంచి బియ్యాన్ని రాబట్టేందుకు పెనాల్టీలు, వడ్డీలు విధిస్తున్న ప్రభుత్వం.. నాణ్యమైన ధాన్యం సరఫరా, టెస్ట్ మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిన బియ్యం శాతం నిర్ధారణ, సకాలంలో గోదాముల్లో ఖాళీ స్థలం ఉంచేలా చూడాల్సిన బాధ్యతలను మాత్రం విస్మరిస్తుందని వారంటున్నారు.ఈ ధోరణి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో రైస్ మిల్లర్ల వ్యవస్థ పూర్తిగా కునారిల్లిపోవడమో, లేక ధాన్యం మిల్లింగు చేయకుండా చేతులెత్తేయడమో జరుగుతుందని మిల్లర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ముందుకురావాలని వారు కోరుతున్నారు.

**రైస్ మిల్లర్ల మెడకు..**

ఈ మూడు ముఖ్యమైన అంశాల్లో ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించకపోవడంతో.. రైస్ మిల్లర్లు డిఫాల్టర్లుగా మారుతున్నారని మిల్లర్లు వాపోతున్నారు. 15 శాతం ముక్కిన/రంగు మారిన ధాన్యం ఇచ్చి.. 2 శాతం ముక్కిన/రంగు మారిన బియ్యం ఇస్తే తీసుకోవడం లేదు. మరీ ముఖ్యంగా ఎఫ్‌సీఐ అయితే.. 0.5 శాతం ఉన్నా.. ససేమిరా అంటూ వెనక్కి పంపిస్తున్నారు. 3 శాతం నిబంధనను ప్రభుత్వ పాటించడం లేదు.పైగా 67 శాతం బియ్యం రావంటున్నా.. బలవంతంగా మిల్లర్ల వద్దకు ధాన్యాన్ని పంపిస్తున్నారు. మరి 15 శాతం ముక్కిన/రంగుమారిన ధాన్యంతో 67 శాతం బియ్యాన్ని ఎలా సరఫరా చేయాలంటూ మిల్లర్లు తలలు బాదుకుంటున్నారు. ఇదే సమయంలో వీలైనంత బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, సివిల్ సప్లకి రవాణా చేసినా, గోదాముల్లో కొరత కారణంగా ఆలస్యం అవుతోంది. దీని ప్రభావం రైస్ మిల్లర్లపైనే పడుతోంది.

# ఎవరికి ఎర్త్..ఎవరికి బెర్త్..

**రేసులో ఈటెల, ధర్మపురి**



**హైదరాబాద్, మే 23:**తెలంగాణలో బీజేపీ బలపడుతున్న తరుణంలో, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ రాజకీయ వర్గాల్లోనూ వేడి పుట్టిస్తోంది. కేంద్రంలో మోదీ 3.0 సర్కార్ రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ, సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేసే దిశగా కొత్త నిర్ణయాలు తీసుకోబోతోంది. ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు కేబినెట్ ర్యాంకు ఇస్తారనే టాక్ ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయనకు ఉన్న మాస్ ఇమేజ్, పార్టీ కేడర్‌లో ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకుని ఆయన పోర్ట్‌ఫోలియోను పెంచే అవకాశం ఉంది. వాస్తవానికి ఆయన కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసుతో ఆయనను అసలు మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ లాంటి పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. కానీ మోదీ భిన్నంగా ఆలోచించే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో బలమైన నేతగా ఉన్న ఈటల రాజేందర్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారనే గాసిప్స్ బలంగా వినిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను కేంద్రంలోకి తీసుకోవడం ద్వారా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి కొట్టవచ్చని బీజేపీ యోచిస్తోంది. ఆయనకు కేబినెట్ లేదా స్వతంత్ర హోదా కలిగిన రాష్ట్ర మంత్రి పదవి దక్కవచ్చని ప్రచారం. మహిళా కోటాలో, దక్షిణ తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే నేతగా డి.కె. అరుణ పేరు పరిశీలనలో ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం ఆమెకు కలిసి వచ్చే అంశం. ఉత్తర తెలంగాణ నుంచి బలమైన వాయిస్ వినిపించే అరవింద్‌ను కూడా ఏదైనా కీలక బాధ్యతల్లోకి తీసుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం బొగ్గు మరియు గనుల శాఖ మంత్రిగా ఉన్న జి. కిషన్ రెడ్డికి బాధ్యతల మార్పు ఉంటుందా అనే చర్చ కూడా నడుస్తోంది. ఆయనను పూర్తిగా పార్టీ సంస్థాగత పనులకు పరిమితం చేస్తారా లేదా ఇంకా కీలకమైన శాఖను అప్పగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నందున, ఆయన అనుభవాన్ని ఎక్కడ వినియోగిస్తారనేది ప్రధాని నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.తెలంగాణలో 2028 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా మోదీ తన టీమ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. కేబినెట్ లో చోటు కల్పించడం ద్వారా ఆయా ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని పెంచుకోవాలన్నది వ్యూహం. ఒకవేళ కేబినెట్ విస్తరణ జరిగితే తెలంగాణ నుంచి కనీసం ముగ్గురు లేదా నలుగురికి అవకాశం దక్కవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరోసారి కేంద్ర కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించే అవకాశం లేదు. అందుకే వచ్చే ఎన్నికలకు ఇప్పుడే పూర్తి స్థాయిలో మంత్రివర్గ సమీకరణాలనులెక్కలోకి తీసుకోనున్నారు.

## తాగు నీటి కోసం ఎమ్మెల్యే ధర్నా

**హైదరాబాద్:**జంటనగరాల్లో తాగునీటి కొరత పై ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం ఎదుట ఎల్ బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యకర్తలకు పోలీసులకు మధ్య పెద్ద తోపులాట చోటు చేసుకావడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఆయన మాట్లాడుతూ... ఎండ కాలం వచ్చిందని ముందస్తు హెచ్చరికలు చేసిన హైదరాబాద్ ప్రజలు మాకు ఓటువెయ్యలదన్న కారణం తో పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారు ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. ప్రతి రోజు 750 ఎంజిడిల నీటి సరఫరా అవసరమైతే వీరు 550 ఎంజిడిలు సరఫరా చేస్తున్నారని 200 షాటెజి ఉందని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని చెప్తుంది. ఎంత ఎక్కువ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చెయ్యాల్సివస్తే ప్రభుత్వం అంత ఫెయిల్ అయ్యిందని అర్థమని అన్నారు. మా బిఆర్ఎస్ పాలన లో కెసిఆర్ హయంలో ఎటువంటి నీటి కొరత లేకుండా చూసుకుంన్నామని అన్నారు. ప్రతి పల్లెకు ప్రతి గ్రామానికి ప్రతి తండాకు తాగునీటి సరఫరా చేసామని తెలిపారు. అలాంటిది ఈ కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర రాజధాని హైదరాబాదు మహానగరంలో నీటి కొరత ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు

## భాష ఏదైనా.. ఫిర్యాదు ఇక సులభం

**హైదరాబాద్ పోలీసుల అమ్ములపొదిలోకి 'ఏఐ కాప్‌రైటర్'**

**దేశంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత బహుభాషా ఫిర్యాదుల నమోదు**

**యాప్ ను ఆవిష్కరించిన హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్**



పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషా పరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ కాప్‌రైటర్ అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీలో శనివారం ఏఐ కాప్‌రైటర్ యాప్ ను హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. దాని పనితీరును పరిశీలించారు.నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను పోలీసులు తక్షణమే రికార్డు చేసి, అనువదించుకోవచ్చు. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో తెలుగు, ఇంగ్లీష్ రాని ఇతర రాష్ట్రాల వలస కార్మికులు, పర్యాటకులు ఫిర్యాదు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భాష అర్థం కాక ఎఫ్.ఐ.ఆర్ నమోదులో జాప్యం జరగడం, సమాచారం తప్పుగా నమోదవ్వడం వంటి సమస్యలకు ఈ యాప్ స్వస్తి పలకనుంది. 10కి పైగా ప్రధాన భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యం ఈ యాప్ సొంతం. ఈ వినూత్న యాప్ ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సంస్థతో పాటు ఇంటర్న్ పాగ్రో చందు సహకారంతో హైదరాబాద్ సిటీ పోలీస్ రూపొందించింది.

## కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ సర్కార్ విఫలం: కవిత



**హైదరాబాద్, మే 23 :** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈరోజు (శనివారం) ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.

**సమస్యలు పరిష్కరించకపోతే ధర్నాచేస్తా..**

రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

## టెక్నోరీచ్ సీఈఓపై వేధింపుల ఆరోపణలు.. కేసు నమోదు




**హైదరాబాద్, మే 23:** టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్ గౌడ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్టు లక్ష్మీకాంత్‌పై ఆరోపణలు వచ్చాయి. ట్రైనింగ్ పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మార్చిలో 80 నుంచి 90 మంది ఉద్యోగులను సంస్థ నియమించుకుంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా లక్ష్మీకాంత్ వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆఫీస్ అద్దె చెల్లించకపోవడంతో గత నెల 25న కార్యాలయానికి తాళం పడింది. జీతాల కోసం ప్రశ్నించిన ఉద్యోగిని సీఈఓ దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్లబ్బులు, పబ్బులకు రావాలంటూ మహిళా ఉద్యోగినిపై ఒత్తిడి చేసినట్టు ఫిర్యాదు వచ్చింది. పెండింగ్ జీతాలు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీకాంత్ గౌడ్‌పై బెదిరింపులు, వేధింపులు, మోసం తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

## సీఎం రేవంత్ పర్యటనలో గందరగోళం

**15 నిమిషాలు చాపర్లోనే వేచి ఉన్న సీఎం, మంత్రులు**

**యాదాద్రి భువనగిరి:**శనివారం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదాద్రి పర్యటనలో గందరగోళం ఏర్పడింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం తరువాత సీఎం, మంత్రులు నేరుగా వేద పాఠశాల శంకుస్థాపన ప్రాంగణం పెద్ద గుట్టకు చేరుకున్నారు. సీఎం చాపర్ ల్యాండ్ అయ్యాక కూడా జిల్లా యంత్రాంగం అధికారులు రిసీవ్ చేసుకోడానికి రాలేదు. సీఎం, మంత్రుల పర్యటనలో స్థానిక కలెక్టరేట్, పోలీస్ యంత్రాంగం ఇంతటి నిర్లక్ష్యం ప్రదర్శించడంపై సచివాలయ వర్గాలు సీరియస్ అయ్యాయి.

## మేడ్చల్, మల్కాజ్గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ అరెస్ట్

**హైదరాబాద్:**మేడ్చల్, మల్కాజ్గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసారు. సోదాల అనంతరం, వంశీ మోహన్ను రిమాండ్కు తరలించారు. ఏసీబీ తనిఖీల్లో రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులు గుర్తించారు. వంశీ మోహన్ మామ 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్గా తీసుకున్నట్లు ఆరోపణ వచ్చాయి. 19 ఇళ్ల స్థలాలు, ఇబ్రహీంపట్నంలో 2 ఎకరాల ఫామ్హౌస్.. వనస్థలిపురంలో విలాసవంతమైన ఇల్లు, మణికొండ, మజీద్బండలో లగ్జరీ ప్లాట్లు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల్లో రూ.20 లక్షలు గుర్తింపు.. రూ.2.10 లక్షల నగదు, 122 గ్రాముల బంగారం, 2 కార్లు సీజ్ చేసారు.

## యాదాద్రిలో సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు...

**యాదాద్రి:**పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులు తీసుకుని స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి కి ఆశీర్వచనం అందించారు.ముఖ్యమంత్రి తో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , చామల కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# చాలా మందికి సాయంత్రం సమయంలో జంక్ ఫుడ్ తినాలనిపిస్తుంది.. ఎందుకని.. ఏం చేయాలి..?



బరువు తగ్గాలని ప్రయత్నించే చాలా మందికి సాయంత్రం సమయం పెద్ద పరీక్షలా అనిపిస్తుందని చెప్పవచ్చు. ఉదయం నుంచి నియంత్రణలోనే ఆహారం తీసుకున్నా, సాయంత్రం 5–6 గంటలయ్యేసరికి ఒక్కసారిగా ఆకలి, తీపి లేదా కారంగా ఏదైనా తినాలనే కోరిక పెరుగుతుంది. చాలామంది దీనిని తమ నియంత్రణ లేకపోవడంగా భావిస్తారు. కానీ నిజానికి దీనికి కారణం శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులేనని నిపుణులు చెబుతున్నారు. రోజూ గడిచేకొద్దీ ఆకలిని పెంచే ఘ్రెలిన్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. అదే సమయంలో కడుపు నిండిన భావన కలిగించే లెప్టిన్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. దీనికి తోడు శరీరంలో శక్తి స్థాయిలు పడిపోవడం, రక్తంలో చక్కెర స్థాయుల్లో మార్పులు రావడం జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో మెదడు తక్షణ శక్తి కోసం తీపి పదార్థాలు లేదా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని కోరుకుంటుంది.


**అణచివేయకూడదు..**

అందుకే సాయంత్రం వేళల్లో వచ్చే ఆకలిని పూర్తిగా అణచివేయడానికి ప్రయత్నించడం కంటే, సరైన విధంగా నియంత్రించడం మంచిదని సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రోటీన్, ఫైబర్ కలిగిన స్నాక్స్ తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉంటుంది. అలాగే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో సహాయపడుతుంది. దీంతో అకస్మాత్తుగా వచ్చే క్రేవింగ్స్ తగ్గి, రాత్రి భోజన సమయంలో అధికంగా తినే అలవాటు కూడా తగ్గుతుంది.

**వీటిని తీసుకోవాలి..**

సాయంత్రం సమయాల్లో బిస్కెట్లు, స్వీట్లు లేదా జంక్ ఫుడ్ తీసుకునే బదులుగా పండ్లతోపాటు నట్స్, గింజలతో కలిపిన పెరుగు లేదా తేలికపాటి ప్రోటీన్ ఆధారిత స్నాక్స్ తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. స్నాక్స్ పూర్తిగా మానేయడం లక్ష్యంగా కాకుండా దానికి బదులుగా శరీరానికి అనుకూలంగా ఉండే ఆరోగ్యకరమైన ఎంపికలు చేసుకోవడం ముఖ్యం. శరీరంలో జరిగే సహజ మార్పులను అర్థం చేసుకుని ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు చేస్తే, ఆరోగ్య లక్ష్యాలను సులభంగా కొనసాగించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# కీళ్ల నొప్పులకు అసలు కారణాలేంటి.. ఎన్ని రకాలుగా ఉంటాయి?



నేటి తరుణంలో కీళ్ల నొప్పులు సాధారణ ఆరోగ్య సమస్యగా మారాయని చెప్పవచ్చు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ లేదా శరీర నిర్మాణ సంబంధిత సమస్యల కారణంగా చాలా మంది ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఇందులో ముఖ్యంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియోఆర్థరైటిస్ అనే రెండు వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే చాలా మంది ఈ రెండూ ఒకటేనని భావిస్తారు. కానీ వీటి కారణాలు, లక్షణాలు, చికిత్స విధానాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది ఒక ఆటోఇమ్యూన్ వ్యాధి. అంటే శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున తన ఆరోగ్యకరమైన కణాలపైనే దాడి చేయడం. ముఖ్యంగా కీళ్ల చుట్టూ ఉండే పొరపై ప్రభావం చూపి తీవ్రమైన వాపు, నొప్పి, కీళ్లు దెబ్బతినే పరిస్థితిని కలిగిస్తుంది. ఈ వ్యాధి కేవలం కీళ్లకే పరిమితం కాకుండా చర్మం, కళ్లు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని దీర్ఘకాలికంగా నియంత్రించడం చాలా ముఖ్యం.

**ఆర్థరైటిస్‌లో ఇవి రెండూ ప్రధాన రకాలు..**

ఇక ఆస్టియోఆర్థరైటిస్ మాత్రం వయస్సు, అధిక వినియోగం లేదా కీళ్లపై ఒత్తిడి కారణంగా ఏర్పడే సమస్య. కీళ్ల మధ్య ఉండే కార్టిలేజ్ క్రమంగా దెబ్బతినడం వల్ల ఎముకలు ఒకదానికొకటి రుద్దుకోవడం మొదలవుతుంది. దీని వల్ల నొప్పి, గట్టిపడటం, కదలికల్లో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా మోకాళ్లు, నడుము, వెన్నెముక వంటి బరువు మోసే కీళ్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఈ రెండు వ్యాధుల లక్షణాల్లో కూడా స్పష్టమైన తేడాలు ఉంటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో ఉదయం లేవగానే గంటల పాటు కీళ్లు గట్టిపడటం కనిపిస్తుంది. శరీర అలసట, స్వల్ప జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కూడా ఉండవచ్చు. ముఖ్యంగా శరీరంలోని రెండు వైపులా ఒకే కీళ్లు ప్రభావితమవడం దీని ప్రత్యేక లక్షణం. ఆస్టియోఆర్థరైటిస్‌లో అయితే కదలికలు చేసినప్పుడు నొప్పి పెరగడం, విశ్రాంతి తీసుకుంటే కొంత ఉపశమనం కలగడం కనిపిస్తుంది. కొద్దిసేపు కూర్చున్న తర్వాత లేదా నిద్రలేచినప్పుడు తాత్కాలికంగా కీళ్లు గట్టిగా అనిపిస్తాయి. అలాగే కీళ్లు కదిలించినప్పుడు రాపిడి శబ్దం వినిపించడం కూడా ఈ సమస్యలో సాధారణం. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు జన్యుపరమైన కారణాలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ధూమపానం వంటి అంశాలు కారణమవుతాయి. ఇక ఆస్టియోఆర్థరైటిస్‌కు వయస్సు, అధిక బరువు, పాత గాయాలు, ఒకే విధమైన శారీరక పనులు ఎక్కువకాలం చేయడం వంటి కారణాలు ప్రధానంగా ఉంటాయి.

**సరైన నిర్ధారణ ముఖ్యం..**

వైద్యుల ప్రకారం, సరైన నిర్ధారణ చాలా ముఖ్యమని చెబుతున్నారు. ఆస్టియోఆర్థరైటిస్‌ను సాధారణంగా ఎక్స్‌రేలు, శారీరక పరీక్షల ద్వారా గుర్తిస్తారు. కీళ్ల మధ్య ఖాళీ తగ్గడం, ఎముక పెరుగుదల వంటి లక్షణాలు కనిపిస్తాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్ నిర్ధారణకు మాత్రం రక్తపరీక్షలు కూడా అవసరం అవుతాయి. రుమటాయిడ్ ఫ్యాక్టర్, యాంటీ–సీసీపీ యాంటీబాడీలు, ఈఎస్సార్, సీఆర్‌పీ వంటి ఇన్‌ఫ్లమేషన్ సూచికలను పరిశీలిస్తారు. చికిత్సలో కూడా రెండింటికీ వేర్వేరు విధానాలు ఉంటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో వ్యాధి వేగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక మందులు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఔషధాలు, బయాలజికల్ థెరపీలు వాడతారు. ఆస్టియోఆర్థరైటిస్‌లో అయితే నొప్పి నియంత్రణ, ఫిజియోథెరపీ, బరువు తగ్గించడం, జీవనశైలిలో మార్పులు ముఖ్య పాత్ర పోషిస్తాయి.

**జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్స..**

అధిక స్థాయిలో కీళ్లు దెబ్బతిన్నప్పుడు జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స అవసరం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రోబోటిక్ సాంకేతికతతో చేసే జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్సలు మరింత కచ్చితత్వంతో, త్వరగా కోలుకునేలా సహాయపడుతున్నాయని పేర్కొంటున్నారు. కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే బరువును నియంత్రణలో ఉంచడం, తక్కువ ఒత్తిడి కలిగించే వ్యాయామాలు చేయడం, ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎక్కువసేపు ఒకే స్థితిలో ఉండకుండా తరచూ కదలికలు చేయడం కూడా కీళ్ల గట్టిపడకుండా సహాయపడుతుంది. కొన్ని వారాలకు మించి కీళ్ల నొప్పులు కొనసాగితే, వాపు, వేడి లేదా కదలికల్లో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే..

ఇటీవల కాలంలో గట్ హెల్త్ (జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం) గురించి అవగాహన పెరుగుతోంది. గట్ హెల్త్ జీర్ణక్రియకే పరిమితం కాకుండా శరీర రోగనిరోధక శక్తి, మానసిక ఆరోగ్యం వంటి అనేక అంశాలపై ప్రభావం చూపుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారాలనే తీసుకుంటున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నప్పటికీ గట్ సమస్యలు తగ్గడం లేదని చాలా మంది చెబుతున్నారు. దీనికి కారణం కేవలం హెల్తీ ఫుడ్ మాత్రమే సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో గట్ మైక్రోబయోమ్ అనే సూక్ష్మజీవుల సమూహం ఉంటుంది. ఇవి జీర్ణక్రియకు సహాయం చేయడమే కాకుండా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ మైక్రోబయోమ్ సమతుల్యత దెబ్బతింటే, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా కూడా పూర్తి ప్రయోజనం కనిపించదు.

**పులియబెట్టిన ఆహారాలు అయితే..**

ఇలాంటి పరిస్థితుల్లో ఫెర్మెంటెడ్ ఫుడ్స్ లేదా పులియబెట్టిన ఆహారాలు ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరానికి ఉపయోగకరమైన బ్యాక్టీరియాను అందించి గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. యోగర్ట్, కేఫిర్, కిమ్చి, సావర్‌క్రాట్ వంటి ఆహారాల్లో మంచి బ్యాక్టీరియా అధికంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే కేవలం ఫెర్మెంటెడ్ ఫుడ్స్ మాత్రమే సరిపోవని, వాటితో పాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని కూడా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. గింజలు, బీన్స్, ఓట్స్, పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం మంచి బ్యాక్టీరియాకు ఇంధనంలా పనిచేస్తుంది. ఈ రెండూ కలిసి గట్ మైక్రోబయోమ్‌ను బలంగా ఉంచడంలో సహాయపడతాయి.

**జీర్ణ సమస్యలకు చెక్..**

ఇలా ఫెర్మెంటెడ్ ఫుడ్స్‌తో కూడిన ఆహారాన్ని రెండు వారాల పాటు క్రమంగా తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటం, పోషకాలు శరీరానికి బాగా అందడం, రోగనిరోధక శక్తి పెరగడం వంటి మార్పులు కనిపించే అవకాశం ఉంటుంది. అలాగే పొట్ట బరువుగా అనిపించడం, అజీర్ణం వంటి సమస్యలు కూడా తగ్గవచ్చని సూచిస్తున్నారు. అయితే ఈ ఆహారాలను ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. మొదట చిన్న మోతాదులో ప్రారంభించడం ఉత్తమం. ఉదాహరణకు రోజుకు అర కప్పు పెరుగు లేదా కొద్దిపాటి కిమ్చితో ప్రారంభించి, శరీరం అలవాటు పడిన తర్వాత నెమ్మదిగా మోతాదును పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## బిజినెస్

### తగ్గిన ఓలా ఎలక్ట్రిక్ నష్టం..
### తొలిసారి పాజిటివ్ క్యాష్ ఫ్లో




**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ గత ఆర్థిక సంవత్సరం (2025--26) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.500 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. అయితే, అంతక్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.870 కోట్ల నష్టంతో పోలిస్తే ఈసారి నష్టం 42.5 శాతం తగ్గింది. ఆదాయం 57 శాతం క్షీణించి రూ.611 కోట్ల నుంచి రూ.265 కోట్లకు దిగజారింది. ఆదాయం తగ్గినా, స్థూల మార్జిన్లు మెరుగయ్యాయి. ఇవి వార్షిక ప్రాతిపదికన 13.7% నుంచి 38.5 శాతానికి చేరాయి. పీఎల్ఐ ప్రోత్సాహకాలు, మెరుగైన స్థూల మార్జిన్లు, కఠినమైన వ్యయ నియంత్రణ కారణంగా కంపెనీ చరిత్రలో తొలిసారిగా కార్యకలాపాల నగదు ప్రవాహం పాజిటివ్‌గా మారి క్యూ4లో రూ.91 కోట్లుగా నమోదైంది. ఆటోమొబైల్ వ్యాపారం నుంచి రూ.213 కోట్ల ఆపరేటింగ్ క్యాష్ ఫ్లో, రూ.173 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో (ఎఫ్‌సీఎఫ్) నమోదయ్యాయి. మార్చి త్రైమాసికంలో మొత్తం 20,256 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కంపెనీ విక్రయించింది. ఇక పూర్తి 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ మొత్తం రూ.2,253 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా.. రూ.1,833 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తంలో ఓలా ఎలక్ట్రిక్ మొత్తం 1,73,794 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను డెలివరీ చేసింది.

### ఐపీఎల్ వెలుగులో బెట్టింగ్ 'చీకటి ఆట'!

ఐపీఎల్ సీజన్‌ను ఆసరాగా చేసుకుని భారతీయ క్రికెట్ అభిమానులను పెద్ద ఎత్తున ముంచేస్తున్న ఒక భారీ అక్రమ బెట్టింగ్ నెట్‌వర్క్‌ను ప్రముఖ సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థ 'క్లౌడ్‌సెక్' బట్టబయలు చేసింది. క్లోన్-స్క్రిప్ట్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డీప్‌ఫేక్స్, హ్యాక్ చేసిన ప్రభుత్వ వెబ్‌సైట్లు, మనీ లాండరింగ్ నెట్‌వర్క్‌ల సహాయంతో ఈ ముఠా ఇంతటి భారీ దోపిడీకి పాల్పడుతున్నట్లు సంస్థ తన తాజా పరిశోధనలో వెల్లడించింది. గత వారమే ఐపీఎల్ వీక్షకులను లక్ష్యంగా చేసుకుని నడుస్తున్న నకిలీ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను గుర్తించిన క్లౌడ్‌సెక్, తాజాగా ఈ అక్రమ బెట్టింగ్ ఎకానమీ వెనుక ఉన్న చీకటి ప్రపంచాన్ని పూర్తిగా మ్యాప్ చేసింది. 1,200కు పైగా నకిలీ డొమైన్లు: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రోత్సహించడానికి 1,200 కంటే ఎక్కువ వెబ్‌సైట్ డొమైన్లు యాక్టివ్‌గా పనిచేస్తున్నట్లు క్లౌడ్‌సెక్ గుర్తించింది. ఒక్క బ్యాకెండ్.. 25 వెబ్‌సైట్లు: పరిశోధకులు ఒక అక్రమ ప్లాట్‌ఫారమ్ అడ్మిన్ ప్యానెల్‌ను యాక్సెస్ చేయగా, కేవలం ఒకే ఒక్క బ్యాకెండ్ సిస్టమ్ నుండి 25కు పైగా వేర్వేరు బెట్టింగ్ వెబ్‌సైట్లను నడుపుతున్నట్లు తేలింది. దీని ద్వారా యూజర్ల డిపాజిట్లు, బెట్టింగులు, విత్‌డ్రా రిక్వెస్ట్‌లను నిందితులు పూర్తిగా నియంత్రిస్తున్నారు. రూ. 4.65 కోట్ల విత్‌డ్రా నిరాకరణ: మే 2025 నుండి మే 2026 మధ్య కాలంలో, ఈ ఒక్క ప్లాట్‌ఫారమ్‌లోనే వినియోగదారులు చేసుకున్న 9,300 లకు పైగా డబ్బు విత్‌డ్రా రిక్వెస్ట్‌లను ఏజెంట్లు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారు.

# ఫోర్బ్స్ బిలియనీర్స్.. జాబితాలో 229 మంది భారతీయులు!

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రూపాయి విలువ క్షీణించినప్పటికీ భారత బిలియనీర్‌లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా-2026 ప్రకారం.. భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తుల విలువ తొలిసారి లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటడం విశేషం. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్తవారు ఈ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు. భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. మొత్తం 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలో మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఇక ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు. భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది. ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ 'ఫిజిక్స్ వాలా' కో-ఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన తమ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్ కావడంతో ఈ ఇద్దరు కుబేరుల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. ఇక ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా



అరవింద్ శ్రీనివాస్ (31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న 'పెర్‌ప్లెక్సిటీ' ఏఐ సెర్చ్ స్టార్టప్ కో-ఫౌండర్ అయిన ఈయన శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత 'పేటీఎమ్' వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి పునరాగమనం చేశారు. మరోవైపు 'ఓలా క్యాబ్స్' ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తోపాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.

**భారత టాప్-10 బిలియనీర్‌లు వీళ్లే..**

1. ముకేశ్ అంబానీ - 99.7 బిలియన్ డాలర్‌లు, 2. గౌతమ్ అదానీ - 63.8 బిలియన్ డాలర్‌లు, 3. సావిత్రి జిందాల్ - 39.1 బిలియన్ డాలర్‌లు, 4. లక్ష్మీ మిట్టల్ - 31.0 బిలియన్ డాలర్‌లు, 5. శివ్ నాడార్ - 30.9 బిలియన్ డాలర్‌లు, 6. సైరస్ పూనావాలా - 27.0 బిలియన్ డాలర్‌లు, 7. దిలీప్ సంఘ్వీ - 25.6 బిలియన్ డాలర్‌లు, 8. కుమార్ బిర్లా - 21.1 బిలియన్ డాలర్‌లు, 9. రాధాకిషన్ దమానీ - 15.7 బిలియన్ డాలర్‌లు, 10. ఉదయ్ కోటక్ - 14.4 బిలియన్ డాలర్‌లు.

# నష్టాల్లో ముగిసిన భారతీయ స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 135, నిఫ్టీ 5 పాయింట్లు పతనం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి, 75,183.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా.. అంటే 4.30 పాయింట్లు నష్టపోయి 23,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే కొనసాగింది. సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లు పెరిగింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ చివరికి నష్టాల్లో ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని ట్రంప్ ప్రకటించడం ఉదయం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఆర్బీఐ రేట్లు పెంచుతుందనే భయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు వంటివి మార్కెట్ నష్టాలకు కారణాలు. ఐటీ, ఎఎఫ్‌సీజీ షేర్లపై ఒత్తిడి పెరగడంతో మార్కెట్ ప్రభావితమైంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు నష్టపోయాయి. అల్ట్రాటెక్, ఇండిగో, అదానీ పోర్ట్స్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభాలు చవిచూశాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4518 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు గురువారం రూపాయి స్వల్పంగా



లాభపడింది. డాలర్‌తో రూపాయి 63 పైసలు బలపడి 96.23కు చేరింది.

# నిరాశపరిచారు టీమిండియా సెలక్టర్లపై విమర్శలు

టీమిండియా సెలక్షన్ కమిటీ తీరును ప్రముఖ కామెంటేటర్ హర్షా భోగ్లే విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటే ఆటగాళ్లను విస్మరించడం ఎంతమాత్రం తగదన్నాడు. అఫ్గనిస్తాన్‌తో ఏకైక టెస్టుకు జమ్మూ కశ్మీర్ ఎక్స్‌ప్రెస్ ఆకిబ్ నబీని ఎంపిక చేయకపోవడం తనను తీవ్రంగా నిరాశపరిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. ఐపీఎల్-2026 ముగిసిన వెంటనే భారత జట్టు అంతర్జాతీయ క్రికెట్ (జూన్ 6 నుంచి)తో బిజీ కానుంది. ఇందులో భాగంగా తొలుత స్వదేశంలో అఫ్గనిస్తాన్ ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడనుంది. ఇందుకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్లను ప్రకటించింది.

**గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి పిలుపు**

ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినివ్వగా.. గుర్నూర్ బ్రార్ తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణతో కలిసి పేస్ దళంలో చేరాడు. అయితే, మెజారిటీ మంది విశ్లేషకులు అఫ్గన్‌తో టెస్టుకు ఆకిబ్ నబీని తప్పక ఎంపిక చేస్తారని భావించారు. కానీ సెలక్టర్లు మాత్రం అతడికి మొండిచేయి చూపారు. ఈ నేపథ్యంలో ఆకిబ్ నబీ పట్ల సెలక్షన్ కమిటీ వ్యవహారశైలిపై హర్ష్ భోగ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. "ఈ జట్టులో ఆకిబ్ నబీ తప్పక ఉంటాడని నేను విశ్వసించాను. అతడి గురించి చర్చ కూడా




జరిగింది.

**అతడిని ఎందుకు ఎంపిక చేయలేదు?**

అతడి బౌలింగ్‌లో తగినంత పేస్ ఉందా? లేదా? అన్న విషయంతో నాకు సంబంధం లేదు. బౌలింగ్ చేస్తున్న సమయంలో అతడు బ్యాలెన్స్ చేసుకుంటున్నాడా? లేదా? అన్నది కూడా నాకు అక్కర్లేదు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రెండేళ్లలో అతడు వందకు పైగా వికెట్లు కూల్చాడు. అలాంటి బౌలర్‌కు ప్రోత్సాహం అందించడం కనీస బాధ్యత. అతడిని ఎంపిక చేసి ఉంటే దేశీ క్రికెట్లో సత్తా చాటే ఆటగాళ్లకు మంచి బూస్టప్ లభించేది. టెస్టుల్లో రాణించాలనే కసి మరింత పెరిగేది. అఫ్గన్‌తో టెస్టులో తుదిజట్టులో ఆకిబ్ నబీకి చోటు ఇవ్వకున్నా పర్లేదు. కానీ పదిహేను మంది సభ్యుల జట్టుకు మాత్రం అతడిని ఎంపిక చేయాల్సింది. అతడికి ఫిట్‌నెస్ సమస్యలు కూడా లేవు.

**ఏం మెసేజ్ ఇస్తు న్నారు?**

దేశీ క్రికెట్లో ఓ బౌలర్‌గా ఎంతగా రాణించాలో.. అంతా చేసి చూపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో తొమ్మిదో స్థానంలో మెరుగ్గా ఆడగలడు. అయినప్పటికీ అతడిని ఎంపిక చేయకపోవడం నిజంగా నిరాశాజనకం. ఈ సెలక్షన్ కమిటీకి ఆకిబ్ నబీని ఎంపిక చేయకపోవడానికి గల కారణాలు ఎన్నో ఉండి ఉంటాయి. కానీ వారి చర్యల ద్వారా ఇచ్చే సందేశం మాత్రం సరిగ్గా లేదు" అని హర్షా భోగ్లే యూట్యూబ్ చానెల్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్నాడు. కాగా 2025-26 సీజన్‌లో పది మ్యాచ్‌లలో ఆకిబ్ నబీ జమ్మూ కశ్మీర్ తరఫున 60 వికెట్లు తీశాడు. తన జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక అంతకుముందు సీజన్లో ఆకిబ్.. 44 వికెట్లతో సత్తా చాటాడు.

### పాండ్యాకు మ్యాచ్ ఫీజులో భారీ కోత.. ఒక డీమెరిట్ పాయింట్..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నాయకుడిగా, ఆటగాడిగా దారుణంగా విఫలమైన హార్దిక్ పాండ్యాకు జరిమానా పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లఘించినందుకు అతడు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోల్పోనున్నాడు. మ్యాచ్ సమయంలో క్రికెట్ వస్తువులు(బ్యాట్, బంతి, వికెట్లు, గ్లోవ్స్, బెయిల్స్) పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు అతడికి రిఫరీ రాజీవ్ సేథ్ జరిమానా విధించాడు. అసలేం జరిగిందంటే.. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఢీకొన్నాయి. కోల్‌కతా ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్ వేసిన పాండ్యా.. నాలుగో బతికి రనప్ కోసం నడుచుకుంటూ వెళ్తూ చేతితో బెయిల్స్‌ను నెట్టేస్తున్నట్టు బలంగా తాకాడు. దాంతో, అవి కిందపడిపోయాడు. అతడి చర్యను తీవ్రంగా పరిగణించిన పాండ్యాను విచారణకు పలిచాడు రిఫరీ రాజీవ్ సేథ్. ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.2ను పాండ్యా ఉల్లంఘించాడని రిఫరీ



తెలుపగా.. తాను నేరం చేశానని ముంబై కెప్టెన్ అంగీకరించాడు. దాంతో, రిఫరీ అతడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించాడు. ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించాడు. కోల్‌కతా చేతిలో ఘోర ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీజన్ ఆసాంతం పేలవ ఫీల్డింగ్ తమ కొంపముంచిందని పాండ్యా తెలిపాడు.

**రాజస్థాన్ రాయల్స్‌తో**

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 19వ సీజన్‌లో అనూహ్య తడబాటుతో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశను హ్యాట్రిక్ విజయాలతో ముగిద్దామనుకుంటే కోల్‌కతా నైట్ రెడర్స్ ముంబైని దెబ్బకొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో హార్దిక్ పాండ్యా బృందాన్ని 147కే నిలువరించిన కేకేఆర్ స్వల్ప లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి నాకౌట్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది.

## స్పోర్ట్స్

### ఒకప్పుడు కలిసి ఆడారు.. ఇప్పుడు గురుశిష్యులుగా..!



ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందే నొవాక్ జకోవిచ్ కొత్త కోచ్‌ను నియమించుకున్నాడు. ఏడాది కాలంగా కోచ్ లేకుండానే ఆడుతున్న జొకో సెర్బియాకే చెందిన విక్టర్ ట్రాయ్‌స్కీ (ఎఱనిశీతీ ఉతీశీఱష్ఱ)ను హెడ్‌కోచ్‌గా పరిచయం చేశాడు. ఒకప్పుడు స్నేహితులైన ఈ ఇద్దరూ ఇప్పుడు గురు శిష్యులుగా కొత్త ప్రయాణం మొదలెట్టనున్నారు. విక్టర్‌ను కోచ్‌గా తీసుకున్న విషయాన్ని బుధవారం జకోవిచ్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. రెండేళ్ల క్రితమే 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన జకోవిచ్.. 25వ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్నాడు. మే 22న 39వ వసంతంలో అడుగుపెట్టనున్న ఈ స్టార్ ఆటగాడు.. కొన్నిరోజులుగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ గెలవాలనే కసితో ఉన్నాడు. అందుకోసం.. ఈ తరం కుర్రాళ్లు జన్నిక్ సిన్నర్, అల్కరాజ్‌లను ధీటుగా ఎదుర్కొనేందుకు, తన ఆటను మరింత సానబెట్టుకునేందుకు అతడు కొత్త కోచ్‌ను నియమించుకున్నాడు. ఒకప్పుడు స్నేహితుడు, సహచరుడు అయిన విక్టర్ ట్రాయ్‌స్కీని నూతన కోచ్‌గా అందరికీ పరిచయం చేశాడు జకో. 'నా స్నేహితుడు, సహచరుడు, ఇప్పుడు కోచ్. విక్టర్ టాయ్‌స్కీకి స్వాగతం' అని ఇన్‌స్టాగ్రామ్‌లో జకోవిచ్ పోస్ట్ పెట్టాడు. రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌తో గురు శిష్యులుగా వీరిద్దరి జర్నీ మొదలవ్వనుంది. మాజీ టెన్నిస్ ఆటగాడైన విక్టర్‌కు ప్రస్తుతం 40 ఏళ్లు. జకోవిచ్‌తో కలిసి సెర్బియా జట్టుకు పదేళ్లకు పైగా కలిసి ఆడిన విక్టర్ వీడ్కోలు అనంతరం కోచ్ అవతారమెత్తాడు. జకో కోచింగ్ బృందంలో ఒకడిగా చేరిన విక్టర్.. అతడి ఒలింపిక్ పసిడి కలను సాకారం చేశాడు. ఈసారి హెడ్‌కోచ్‌గా వచ్చిన విక్టర్ తన శిష్యుడికి 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కట్టబెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. మే 24 ఆదివారం నుంచి ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమవ్వనుంది.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI :**TEL TEL / 2023/ 84132